క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏర్పేడు: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మార్కుల జాబితా, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని కోరారు.

పేదలకు అన్నదానం



ఏర్పేడు: యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్ తన జన్మదినం సందర్భంగా రాజులపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం అన్నదానం చేశారు. ఆయన కేక్ కట్ చేసి కాలనీ వాసులకు పంపిణీ చేశారు. హనుమంతు నాయక్, వినోద్ మునెమ్మ, అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల తనిఖీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సోమవారం ప్రాంతీయ కళాశాల విద్యాధికారి పి.బాబు, కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ విజయులురెడ్డి సభ్యుల బృందం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో తెలంగాణ జడ్జి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని సోమవారం తెలంగాణ హైకోర్ట్ జడ్జి ప్రియదర్శిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న జడ్జికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం జస్టిస్ ప్రియదర్శిని దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నాణ్యమైన విద్యకు కృషి చేస్తాం

నారాయణవనం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీదేవి తెలిపారు. ఆ సంఘం ఎన్నికల్లో తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలిగా మండలంలోని జీఎస్ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన బోధనకు ఉపాధ్యాయుల్లో చైతన్యం తీసుకువస్తామని, హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. శ్రీదేవిని చెంగ్రాయులు, హేమంతకుమార్, మునికుమార్ అభినందించారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



వరదయ్యపాళెంలో ప్రచార సామగ్రి, ఓటర్ల జాబితాలను అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరదయ్యపాళెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో మెజారిటీ ఓట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసేలా స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సెమీఫైనల్‌గా భావించి ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను, ప్రచార సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, ప్రచార కమిటీ మండల కన్వీనర్ చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చిన్నా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ వినోద్ యాదవ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, పార్టీ నాయకులు శోభన్ యాదవ్, మహేంద్ర, మధు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: కాలుష్యపు కెమికల్ కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని కాపాడాలంటూ కంచన పుత్తూరు వాసులు రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కంచనపుత్తూరులోని కలర్ పాయింట్ అనే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వ్యర్థ జలాలతో సాగునీరు కలుషితం కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామంలోని మామిడి తోటలో దుస్తులకు సంబంధించిన కలర్ పాయింట్ అనే కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న రసాయనిక వ్యర్థాలను పక్కనే ఉన్న చీటి కాలువ, చెరువులోకి వదులుతున్నారని తెలిపారు. రసాయనిక వ్యర్థాలతో కలుషితమైన చీటి కాలువ, చెరువులోని నీటిని రైతులు పంటలకు సాగునీరు వాడకంతో పంటలు దెబ్బతింటున్నాయని, పశువులు, చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనాల నుంచి వచ్చే దుర్వాసనను పీల్చడంతో అనారోగ్యం పాలు అవుతున్నామని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేశారు.

న్యూమోనియాపై అవగాహన



సంచార జాతుల వారికి న్యూమోనియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తొట్టంబేడు, హరిజనవాడలో సోమవారం గ్రామస్తులకు న్యూమోనియాపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారా న్యూమోనియాను నివారించవచ్చన్నారు. బీడీ కాలనీ వద్ద గుడారాలు వేసుకుని నివసిస్తున్న సంచార జాతుల వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశాకార్యకర్త భారతి పాల్గొన్నారు.

2న పంచాయతీ ఆస్తుల వేలం

పిచ్చాటూరు: పిచ్చాటూరు పంచాయతీ ఆస్తులకు మార్చి 2వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, కార్యదర్శి రాధిక తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక సచివాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బహిరంగ వేలం జరగనుందన్నారు. పంచాయతీకి చెందిన గంగాధర్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని 23 గదులకు వేలం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 3 గంటలకు జంతువధశాల, కూరగాయల మార్కెట్ (ఆర్టీసీ బస్టాండ్ తప్ప) వేలం పాట జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలసిన వారు ముందస్తు ధరావతు రుసుము చెల్లించి సాల్వేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించండి



గురవరాజుపల్లిలో ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

రేణిగుంట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఆర్.మల్లవరం, కృష్ణాపురం, గుత్తివారిపల్లి, గురవరాజుపల్లి, తూకివాకం గ్రామాల్లో ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచులు ఆవుల మునివెంకట్రామిరెడ్డి, ముద్దు రాయులు, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ఆలయం వద్ద పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన సోమవారం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో రూ.4 కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. బుధవారం మూలవిరాట్‌ను మినహాయించి జయ, విజయులు, గరుత్మంతుడు, హనుమంతుడి విగ్రహాలు, ధ్వజస్తంభం పంచనామాను రెవెన్యూ పోలీసు అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్గత పనులు పూర్తి చేసిన తర్వాత మూల విరాట్ వద్ద పనులు చేసేలా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈవో కిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ప్రతాప్, స్థపతి కుమార్, ఆలయ అధికారి హరి, అర్చకులు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

నెల్లిమానుకండ్రిగను శ్రీకాళహస్తిలో కలపాలని వినతి



తహసీల్దార్ సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నెల్లిమానుకండ్రిగ గ్రామస్తులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తమ గ్రామాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కలపాలని మండలంలోని శివనాథపురం పంచాయతీ నెల్లిమానుకండ్రిగ వాసులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ ఎర్రంరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 80 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అందరూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. తమ గ్రామం ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలకు సత్యవేడు నియోజకవర్గం, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి వస్తుందన్నారు. రెవెన్యూ సమస్యల కోసం బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇక్కడి నుంచి బుచ్చినాయిడుకండ్రిగ 20 కిలోమీటర్ల దూరం ఉందని, తొట్టంబేడు మండలం 5 కిలోమీటర్లు మాత్రమే ఉందన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. సరైన రోడ్డు సౌకర్యం లేదని, రెవెన్యూ సమస్యలు కూడా చాలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కలపాలని కోరారు. తహసీల్దార్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రొద్దు తిరుగుడులో శనగపచ్చపురుగు నివారణకు చర్యలు

పిచ్చాటూరు: తులసికృష్ణాపురంలో రైతులు సాగు చేసిన ప్రొద్దు తిరుగుడు పంటకు మొగ్గ దశలో సోకిన శనగ పచ్చ పురుగు నివారణకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. తులసికృష్ణాపురం రైతులు తమ ప్రొద్దు తిరుగుడు పంట మొగ్గ దశలో సోకిన శనగ పచ్చ పురుగు సోకినట్లు ఏఓ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఏఓ సంజీవరెడ్డి కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి సోమవారం గ్రామంలోని ప్రొద్దు తిరుగుడు పంటను పరిశీలించారు. పంటలో శనగపచ్చపురుగు ఉధృతంగా ఉందని గుర్తించారు. ఆ పురుగు నివారణకు నెంల్యూరోన్, ఇండాక్స్‌కార్బ్ కలిపి ఎకరానికి 350 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య, వ్యవసాయ సహాయకులు గజలక్ష్మి, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

సత్యవేడు: మండలంలో సత్యవేడు–3, మదనంబేడు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఎంపీడీఓ బాలగణేషన్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయాలన్నారు. మండలంలో 2,265 కుటుంబాల ఆధార్ నమోదు కోసం కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,380 మందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. అంతకు ముందు సచివాలయాల సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డిజిటల్ అసిస్టెంట్ ఏ. ప్రకాష్ ఆధార్ నమోదు సేవలు అందిస్తున్నారు. సత్యవేడులో 45 మందికి, మదనంబేడులో 31 మందికి ఆధార్ నమోదు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రవిమునికుమార్, సచివాలయ కార్యదర్శి పి.హరీష్, యూ.మాధురి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం



పేదలకు వస్తువులు అందజేస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక నగరవీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సోమవారం పేదలు, దివ్యాంగులకు వస్తువులను పంపిణీ చేసింది. ఇందులో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు ఉచిత బజారు పేరుతో పేదలు, వికలాంగులకు గృహానికి అవసరమైన వస్తువులు అందజేయడం సంతోషకరమన్నారు. ప్రతి నెలా వారికి నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: బీవీపురం పంచాయతీ దళితకాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కలపాటి కామయ్య(62) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో దహనక్రియలకు ఆర్థిక సాయం అందించాలని కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డికి సూచించారు. ఆకర్ష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కామయ్య మృతదేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు సాయం అందించారు.